సాక్షి
అనంతపురం
శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.30

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.16, సరాసరి రూ.24 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/24.6°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో జూలై నెలలో నిర్వహించిన బీటెక్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్ (ఆర్–20) సప్లిమెంటరీ, నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20) సప్లిమెంటరీ, ఎంటెక్, ఎం ఫార్మసీ మూడో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్–17) సప్లిమెంటరీ, రెండో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలు, ఒకటో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి.నాగప్రసాద్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎం.అంకారావు, డాక్టర్ ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు. ఫలితాలు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

జిల్లాకు వర్ష సూచన లేదు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం లేదని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

షెడ్యూల్ ప్రకారం జాబ్ మేళాలు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో జాబ్ మేళాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేలా చూడాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఉపాధి కల్పన కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని సిబ్బంది వివరాలు, వారు చేసే పనులు, కార్యక్రమాలను పరిశీలించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి సమన్వయంతో అప్రెంటిస్‌షిప్ యాక్ట్ ద్వారా ప్రైవేట్ కంపెనీల వారితో సంప్రదించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా జాబ్ మేళాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంకల్ప పథకం కింద వచ్చే నిధులను సరైన పద్ధతిలో వినియోగించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పదో తరగతి తర్వాత ఎలాంటి కోర్సులు చేయాలనే పీపీటీని తయారు చేయాలని ఆదేశించారు. ప్రతి స్కూల్, రెసిడెన్షియల్, ఎస్టీ, ఎస్సీ, బీసీ హాస్టళ్లలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఉపాధి శిక్షణ కార్యక్రమాలు, జాబ్ మేళాలు, విద్యార్థులలో కోర్సులపై అవగాహన కల్పించే విధంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, ఎస్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా చూడాలన్నారు. రాష్ట్రంలోనే అనంతపురం జిల్లాలో ఎక్కువ మందికి ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, ఎస్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రాజ్‌కుమార్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ ద్విచక్ర వాహనానికి నిప్పు



బైక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: కమలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కె.యోగానందకు చెందిన యూనికార్న్ ద్విచక్రవాహనానికి గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు గమనించి తెలపడంతో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూశారు. అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోయింది. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కూడా బాధితుడికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తన ఎదుగుదలను ఓర్వలేక టీడీపీ కార్యకర్తలే ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు యోగానంద అనుమానం వ్యక్తం చేశారు. ఎస్‌ఐ నరేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

వైద్య విద్య కలేనా..?



ప్రశ్నార్థకంగా డాక్టర్ కోర్సు

- రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలకు ఎసరు పెట్టిన చంద్రబాబు సర్కార్
- జిల్లా నుంచి ఏటా నీట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు 1,700 మంది



అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల

అనంతపురం మెడికల్/ఎడ్యుకేషన్: వైద్య విద్యను అభ్యసించాలన్న విద్యార్థుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వంలో పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడంతో పాటు జిల్లా పరిధిలోనే వైద్య విద్యనందించేలా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఒక్కో కళాశాలకు 150 సీట్ల చొప్పున కేటాయించారు. గత ఏడాది రాష్ట్రంలో మచిలీపట్నం, విజయనగరం, ఏలూరు, నంద్యాల, రాజమండ్రిలో ఒక్కోచోట 150 ఎంబీబీఎస్ సీట్లతో కొత్త కళాశాలలు ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం పాడేరు, మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పులివెందులలో మెడికల్ కాలేజీలు ప్రారంభించేందుకు గత ఏడాది నుంచే చర్యలు తీసుకున్నారు. అయితే వీటితో పాటు మిగిలిన వాటికీ చంద్రబాబు సర్కార్ మంగళం పాడేందుకు నిర్ణయం తీసుకుంది. కొత్త కళాశాలలు నడపలేమని.. సీట్లు రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాసింది. కొత్త కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్న ఈ చర్యతో నీట్ (జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష) రాసిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందకపోవడంతో పాటు ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. పిల్లల భవిష్యత్తుతోనూ ఆటలాడుతున్న చంద్రబాబు ప్రభుత్వంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త కాలేజీలు వస్తే సీటు సాధనకు చాన్స్..

వైద్య విద్య కోర్సుల్లో సీటు సాధించడం ఆషామాషీ కాదు. ఇందుకోసం విద్యార్థులు రెగ్యులర్‌గానే కాకుండా రూ.లక్షలు వెచ్చించి లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నారు. అనంతపురం జిల్లాలో ఏటా సుమారు 1,700 మంది విద్యార్థులు 'నీట్' రాస్తారు. కొత్త కళాశాలలు ఏర్పాటైతే సొంత జిల్లాలోనే సులభంగా సీటు సాధించేందుకు అవకాశం ఉంటుంది. కొత్తగా ఏర్పాటయ్యే వాటిలో పెనుకొండ కళాశాల కూడా ఒకటి. ఇక్కడ గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులను కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిపేసింది. దీంతోపాటు రాయలసీమలోని కొత్త కాలేజీలూ ఆగిపోయాయి. ఇవన్నీ అందుబాటులోకి వచ్చి ఉంటే ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేది.

వైద్య విద్య దూరం చేసేలా కుట్ర



పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మాలాంటి పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎంబీబీఎస్ చదవాలంటే ప్రభుత్వ కళాశాలలు అవసరం. ప్రైవేట్ యాజమాన్యంతో నడిచే కళాశాలల ద్వారా వైద్య విద్య మరింత భారం కానుంది. కొత్త కాలేజీలు ప్రారంభించకపోవడంతో పాటు సీట్ల రద్దు కోసం ఎన్‌ఎంసీకు లేఖ రాయడం దారుణం. నూతన కళాశాలలను కొనసాగించాలి.

– పవిత్ర, ఎంబీబీఎస్ సెకండియర్, అనంతపురం

ప్రైవేటీకరణ ఆలోచన దుర్మార్గం



మాది వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తున్న నా కూతురు తేజస్వినిని డాక్టర్‌గా చూడాలన్నదే మా ఆకాంక్ష. మొన్న జరిగిన నీట్ ఫలితాల్లో ఆశించిన ర్యాంకు రాలేదు. దీంతో విజయవాడలోని ఓ కాలేజీలో రూ.2.70 లక్షలు చెల్లించి నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు పంపాను. గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో సీట్లు పెరుగుతాయని చాలా సంతోషించాం. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలని చూడటం చాలా దుర్మార్గమైన ఆలోచన. – యు.సుంకన్న, నక్కనదొడ్డి గ్రామం, గుంతకల్లు మండలం

లేఖను ఉపసంహరించుకోవాలి



ప్రభుత్వ వైద్య కళాశాలలు వద్దంటూ చంద్రబాబు ప్రభుత్వం లేఖ రాయడం కుట్రలో భాగమే. పేదలకు వైద్య విద్యను దూరం చేయాలని ప్రభుత్వం చూస్తోంది. నూతన ప్రభుత్వ కళాశాలలతో పేద విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుంది. ర్యాంకు తక్కువ వచ్చినా సీట్లు వస్తాయి. వైద్య విద్యనభ్యసించాలన్న విద్యార్థుల ఆకాంక్షలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలి. కేంద్రానికి రాసిన లేఖను తక్షణం ఉపసంహరించుకోవాలి.

– కుల్లాయిస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు



నా బిడ్డను ఎంబీబీఎస్ చదివించి వైద్యురాలిని చేయాలనుకున్నా. కొత్త కళాశాలల ఏర్పాటుతో సులభంగా సీటు వస్తుందని భావించాం. జిల్లాలో రాకపోయినా రాష్ట్రంలో ఏదో ఒక చోట సీటు సాధించేందుకు వీలుగా ఉంటుంది. అటువంటిది కొత్త కాలేజీలు రద్దు చేయాలని చూడడం సరికాదు. తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లొద్దు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు.

– శివకుమార్, నీట్ రాసిన విద్యార్థిని పూజిత తండ్రి, కళ్యాణదుర్గం

ప్రైవేటీకరణ సరికాదు



ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలు ప్రారంభించాల్సి ఉంది. తద్వారా ఒక్కో కళాశాలకు 150 సీట్లు వచ్చేవి. కళాశాలలు నడపలేమంటూ కేంద్రానికి లేఖ రాయడం చూస్తుంటే విద్యార్థుల భవిష్యత్తు పట్ల చంద్రబాబు ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో ఇట్టే తెలుస్తుంది. మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు నిలుపుదల చేయడం కరెక్టు కాదు. ముఖ్యంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం సరికాదు.

– పరమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

తాగినోడికి తాగినంత

- ఉమ్మడి జిల్లాలో విరివిగా మద్యం
- 192 నుంచి 247కు పెరగనున్న దుకాణాలు
- ఇప్పటికే మినీ బార్లుగా మారిన హోటళ్లు, ధాబాలు
- రోజుకు రూ.5 కోట్ల దాకా పెరిగిన మద్యం వినియోగం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పుణ్యమా అని ఇకపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగినోడికి తాగినంత అన్నట్టు మారనుంది. ఇన్నాళ్లూ మద్యం నియంత్రించాలన్న ఉద్దేశంతో తక్కువ షాపులు నిర్వహించడం, బహిరంగ మద్యపానం నిర్మూలించడం చేశారు. కానీ టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చలవిడి మద్యానికి తెరలేపింది. కొత్త ఎక్సైజ్ పాలసీ రాకమునుపే హోటళ్లు, ధాబాలు మినీ బార్లుగా మారిపోయాయి. ఎక్కడికక్కడ మద్యం ప్రియులు ఇష్టారాజ్యంగా మద్యం సేవిస్తున్నారు.

కొత్తగా 55 వైన్ షాపులు..

అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ వస్తుందని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అదనంగా 55 వైన్ షాపులు ఏర్పాటవబోతున్నాయి. ప్రస్తుతం 192 షాపులు ఉండగా, ఈ సంఖ్యను 247కు పెంచనున్నారు. దీనిపై జిల్లా అధికారులను రాష్ట్ర ఎక్సైజ్ అధికారులను నివేదిక కోరారు. 1997 తర్వాత ఎన్ని షాపులు ఉన్నాయో ఆ ప్రకారం కొత్తగా షాపులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు.

పర్మిట్ రూములకు అనుమతి!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూములను ఇవ్వనున్నట్టు తెలిసింది. ఇదేగనుక జరిగితే ఇక ఎక్కడ పడితే అక్కడ మద్యం విచ్చలవిడి అవుతుంది. ఓ వైపు పర్మిట్ రూములు, మరోవైపు బార్లు, ఇవన్నీ కాకుండా బెల్టుషాపులు.. వెరసి ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోనూ మద్యం ఏరులై పారే అవకాశం ఉంటుందని చర్చ జరుగుతోంది. ఇప్పటికో ధాబాలు, హోటళ్లు బార్లను తలపిస్తున్నాయి. ఎక్సైజ్, సెబ్, పోలీసు అధికారులు హోటళ్ల నిర్వాహకులతో లాలూచీ పడి అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం నిరంతరాయంగా తాగిస్తున్నారు. లిక్కర్‌కు సంబంధించిన క్రైమ్ రేటు కూడా గడిచిన రెండు మాసాలుగా పెరిగినట్టు తేలింది.

రోజూ రూ.5 కోట్ల మద్యం వినియోగం..


జూన్‌కు ముందు ఉమ్మడి జిల్లాలో రోజుకు రూ.3 కోట్ల నుంచి రూ.3.5 కోట్ల విలువైన మద్యం వినియోగం అయ్యేది. ఇప్పుడది రూ.5 కోట్లకు చేరుకుంది. వచ్చే నెల నుంచి మద్యం చీప్ బ్రాండ్‌లు పెరగనుండటంతో మద్యం వినియోగం మరింతగా వినియోగం అయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇకపై పర్మిట్ రూములు, బెల్టుషాపుల ద్వారా మారుమూల గ్రామాలకు కూడా మద్యం అందుబాటులోకి వచ్చేలా చేస్తున్నారు. రానున్న రోజుల్లో తాగినోడికి తాగినంత అన్నట్టు మద్యం వినియోగం జరగనుందని చర్చ జరుగుతోంది.

అక్టోబర్‌లో ఎక్సైజ్ సర్కిళ్ల వారీగా మొత్తం మద్యం షాపులు ఇలా..

సర్కిల్	మద్యం షాపుల సంఖ్య
అనంతపురం	47
సీకే పల్లి	04
ధర్మవరం	19
గుత్తి	20
గుంతకల్లు	15
హిందూపురం	23
కదిరి	10
కళ్యాణదుర్గం	09
కంబదూరు	05
కణేకల్లు	08
మడకశిర	09
పెనుకొండ	14
పుట్టపర్తి	05
రాయదుర్గం	14
శింగనమల	09
తాడిపత్రి	22
తనకల్లు	05
ఉరవకొండ	09

అయిన వారికోసం అడ్డదారులు!

- సెక్టోరియల్ స్థానాలు కట్టబెట్టేందుకు పడరాని పాట్లు
- ఏపీసీ నుంచి డీపీసీకి వెళ్లిన ఫైలు
- ఫైలుపై సంతకం చేయకుండా 10 రోజుల కిందటే వెనక్కు పంపిన డీపీసీ
- నేరుగా తనే గుట్టుగా దరఖాస్తుల పరిశీలన



శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి బయటకు వెళ్తున్న డీపీసీ వాహనం

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయంలో పని చేస్తున్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులను వెనక్కు పంపేలా చర్యలు తీసుకున్న విద్యాశాఖ అధికారులు...వారి స్థానాల్లో తమకు కావాల్సిన వారికి అందలం ఎక్కించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఏ నిబంధనలను బూచిగా చూపించి పని చేస్తున్న వారిని పంపారో... కొత్తగా తీసుకునే వారి విషయంలోనూ అవే నిబంధనలు అమలు చేయాల్సి ఉంది. సెక్టోరియల్ అధికారుల పోస్టుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు డిప్యూటీ డీఈఓలు, ఎంపిక చేసిన ఎంఈఓలతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సమక్షంలో గత నెల 30న సర్టిఫికెట్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ పూర్తి చేశారు. విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన నిబంధనలను అనుసరించి ఒకటికి రెండుసార్లు పరిశీలించి ప్రతి దరఖాస్తుకూ రిమార్కులు రాసి ఫైలు సిద్ధం చేశారు. స్వయంగా ఏపీసీ నాగరాజు ఈ ఫైలును పది రోజుల కిందట డీపీసీ ఆమోదం కోసం పంపారు. డీపీసీ హోదాలో ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వరలక్ష్మి ఈ ఫైలుపై సంతకం చేసి కలెక్టర్‌కు పంపాల్సి ఉంది. అయితే డీపీసీ సంతకం చేయకపోగా... దరఖాస్తులను పరిశీలించాలంటూ ఆ ఫైలుపై కనీసం సంతకం కూడా చేయకుండా తిరిగి సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపారు.

తనకు కావాల్సిన వారికి అవకాశం రాదనే...

తనకు కావాల్సిన వారికి రిమార్కులు అడ్డంకిగా ఉండడంతో వాటిని సరి చేయడానికి నేరుగా డీఈఓ రంగంలోకి దిగారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగానే శుక్రవారం డీఈఓ సమగ్ర శిక్ష కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులను రహస్యంగా పరిశీలించడం కలకలం రేపుతోంది. వారే స్వయంగా నియమించిన ప్రత్యేక బృందంలోని సభ్యులు కాకుండా డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆదినారాయణ, సీనియర్ అసిస్టెంట్ పార్థసారథిని వెంట పెట్టుకుని మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు డీపీసీ చాంబరులో కూర్చుని దరఖాస్తులను జల్లెడ పట్టడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనకు కావాల్సిన దరఖాస్తుల్లో రిమార్కులు దిద్ది ఉంటారనే ప్రచారం సాగుతోంది. ఇక్కడ సమగ్ర శిక్షలో కీలకమైన ఏపీసీ లేకపోవడం అనుమానాలకు మరింత బలం చేకూరుతోంది. సూపరింటెండెంట్ ప్రదీప్ మాత్రం వారితో ఉన్నారు. సెక్టోరియల్ అధికారుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న సామాన్య టీచర్లు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్నారు. రిమార్కులు సరిచేసి అనర్హులకు అందలం ఎక్కిస్తే మాత్రం తాము కోర్టు మెట్లు ఎక్కుతామంటూ కొందరు బాహాటంగానే చెబుతున్నారు. ఇప్పటికే పలు వివాదాస్పద నిర్ణయాలతో రాష్ట్రస్థాయి దృష్టికి వెళ్లిన జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్వాకం...సెక్టోరియల్ అధికారుల ఎంపికలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగావకాశాలు

- నైపుణ్య కోర్సుల్లో శిక్షణకు కలెక్టర్ ఆదేశం



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: యువతలో నైపుణ్యాలు పెంపొందించడం ద్వారానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంవీవై), సంకల్ప ద్వారా ఎక్కువ మందికి నైపుణ్య కోర్సులపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఇందుకు అనుగుణంగా శిక్షణ కేంద్రాలు పెంచాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతి నెలా జాబ్‌మేళా నిర్వహించేలా ప్రణాళిక తయారు చేయాలన్నారు. వచ్చే వారం జాబ్‌మేళా నిర్వహించాలన్నారు. పరిశ్రమల శాఖ, జన శిక్షణ సంస్థాన్ సంయుక్తంగా స్కిల్ ఫోక్స్ (ఇన్ హౌస్ ట్రెయినింగ్) శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారి రాజ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజారావు, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, డీఆర్‌డీఏ జేడీఎం సూర్యనారాయణ, పాలిటెక్నిక్, ఐటీఐ ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

అనంతపురం: పీఎంకేవీవై ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. నగరంలోని సాయినగర్‌లోని ఎస్‌ఏసీ సెంటర్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఇందులో భాగంగా పీఎంకేవీవై ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థిని, విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. లోకల్‌గా ఉద్యోగం చేసే ఆసక్తి లేకపోతే బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగం చేయగలరా అని కలెక్టర్ అడిగారు. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ఎక్కడికైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలక్ట్రీషియన్, ల్యాండ్ సర్వే శిక్షణలో మంచి నైపుణ్యాలు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రాజ్‌కుమార్, తహసీల్దార్ హరిబాబు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పడిపోయిన పీజీ చేరికలు

- ఎస్కేయూ క్యాంపస్ కళాశాలలో 2 వేలకు కేవలం 279 సీట్లే భర్తీ
- ఇందులోనూ ఎంత మంది చేరతారో తెలియని పరిస్థితి
- ఆర్‌డీ, పీఎస్, ఎంపీఈడీ, అప్లైడ్ ఎకనామిక్స్‌లో ఒక్క సీటూ భర్తీ కాని వైనం

అనంతపురం: సంప్రదాయ పీజీ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కళాశాలల్లో సీట్లు భర్తీ కాని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు పీజీ కోర్సులకు భారీ డిమాండ్ ఉండేది. ఎస్కేయూ క్యాంపస్ కళాశాలలో సీటు దక్కాలంటే ఎంతో కష్టపడి చదవాల్సి ఉండేది. మంచి ర్యాంకు వచ్చినా ఒక్కోసారి సీటు దక్కని పరిస్థితి. కానీ, నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దరఖాస్తు చేసుకుంటే చాలు.. సీటు ఇస్తామనే స్థితి దాపురించింది.

పీజీ విభాగాలు వెలవెల..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల్లో ఆర్ట్స్‌కు సంబంధించి 13 విభాగాల్లో 18 కోర్సులు, సైన్స్‌కు సంబంధించి 16 విభాగాల్లో 19 కలిపి మొత్తం 37 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 2 వేల పీజీ సీట్లు భర్తీ కావాల్సి ఉంది. ఇందుకు తగ్గట్టు హాస్టల్ సదుపాయం ఉంది. కానీ 2024–25 విద్యా సంవత్సరానికి 279 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. రూరల్ డెవలప్‌మెంట్, పాలిమర్ సైన్సెస్, ఎంపీఈడీ, అప్లైడ్ ఎకనామిక్స్ విభాగాల్లో ఒక్క సీటు భర్తీ కాలేదు. దీంతో ఆయా విభాగాలు వెలవెలబోతున్నాయి. సీట్లు పొందిన వారిలోనూ ఎంత మంది అడ్మిషన్ తీసుకుంటారనే అంశం ప్రశ్నార్థకంగా మారింది.

ఎంబీఏ, ఎంసీఏపై ఆసక్తి..

ఏపీ పీజీసెట్‌లో అర్హత మార్కుల పొందిన వారి సంఖ్య నామమాత్రంగా ఉండడం, డిగ్రీ పూర్తయిన వారు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల వైపు ఆసక్తి చూపుతుండడంతోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు పడిపోయినట్లు తెలిసింది. సీట్లు భర్తీ కాని కోర్సుల స్థానంలో వృత్తిపరమైన కోర్సులు అందుబాటులోకి తెస్తే పీజీ పూర్తయిన తరువాత ఉపాధి అవకాశాలు దక్కుతాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

ఎస్కేయూ క్యాంపస్ కళాశాలల్లో విభాగాల వారీగా భర్తీ అయిన సీట్లు

విభాగం	కన్వీనర్ కోటా	మేనేజ్‌మెంట్ కోటా
ఇంగ్లిష్	18	1
తెలుగు	2	0
హిందీ	2	0
అడల్ట్ ఎడ్యుకేషన్	2	0
సోషియాలజీ	7	0
సోషల్ వర్క్	5	0
ఎంఎల్ఐఎస్సీ	5	0
రూరల్ డెవలప్‌మెంట్	5	0
హిస్టరీ	19	0
పొలిటికల్ సైన్సెస్	25	3
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్	2	0
అప్లైడ్ ఎకనామిక్స్	0	0
ఎకనామిక్స్	6	0
కామర్స్	16	0
బోటనీ	12	5
సెరికల్చర్	10	3
జువాలజీ	12	2
అప్లైడ్ మేథమేటిక్స్	43	0
మేథమేటిక్స్	9	0
స్టాటిస్టిక్స్	10	0
ఫిజిక్స్	7	2
కెమిస్ట్రీ	29	1
పాలిమర్ సైన్సెస్	0	0
జియాగ్రఫీ	7	0
ఇన్‌స్ట్రుమెంటేషన్	12	1
ఎంపీఈడీ	0	0

క్లుప్తంగా

మేలైన సాగు పద్ధతులపై చైతన్య పరచండి

- వ్యవసాయ శాఖ కమిషనరేట్ అధికారి లక్ష్మీరెడ్డి



శిక్షణలో అవగాహన కల్పిస్తున్న లక్ష్మీరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులను చైతన్య పరచాలని ఉమ్మడి జిల్లా వ్యవసాయాధికారులకు ఆ శాఖ కమిషనరేట్ అధికారి లక్ష్మీరెడ్డి సూచించారు. మేలైన యాజమాన్య పద్ధతులు (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్–జీఏపీ) అంశంపై అనంతపురంలోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం రెండు జిల్లాల వ్యవసాయశాఖ జేడీలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, డీడీఏలు, ఏడీఏలు, ఏఓలు, రైతు ఉత్పత్తి దారు సంఘాల సభ్యులకు శుక్రవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ అధికారులు మాట్లాడుతూ... మండలానికి ఒకటి చొప్పున చేపట్టిన పొలంబడిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించాలన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే మేలైన సాగు పద్ధతులపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు, సర్టిఫికేషన్ విధానం ద్వారా రైతులకు ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సీడ్ సర్టిఫికేషన్ నిబంధనలను విత్తన నాణ్యత ధ్రువీకరణ అధికారి రవి వివరించారు.

కిడ్నాప్ కలకలం

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ కిడ్నాప్ కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు... బేలోడు గ్రామ సర్పంచ్ ఉమేష్ రెడ్డికి ఓ పోలీస్ అధికారి ఫోన్ చేసి, రాయదుర్గం వైపు నుంచి అనుమానాస్పద స్థితిలో ఓ కారు వస్తోందని దానిని అడ్డుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. దీంతో సర్పంచ్ తన కారును అంగన్‌వాడీ కేంద్రం సర్కిల్ వద్ద రోడ్డుపై అడ్డంగా ఉంచాడు. అయితే రాయదుర్గం వైపు నుంచి వచ్చిన కేఏ35పి2401 నంబర్ గల స్విఫ్ట్ కారు వేగంగా సర్పంచ్ కారును ఢీకొని నేత్రపల్లి వైపుగా దూసుకెళ్లిపోయింది. ఘటనలో జయరామిరెడ్డి అనే వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు ఆ కారును వెంబడించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలను ఫోన్‌లో అప్రమత్తం చేసినప్పటికీ ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ లభ్యంకాలేదు. పోలీసులు సైతం రంగంలో దిగినా కారు ఆచూకీ గుర్తించలేకపోయారు. అయితే కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి... గోళ్ల వద్ద పట్టుబడినట్లు సమాచారం. ఈ విషయంపై రూరల్ సీఐ వెంకటరమణ మాట్లాడుతూ.. కారు వెళ్లింది నిజమే కానీ, ,వారి అచూకీ లభ్యం కాలేదన్నారు. అయితే అందరూ అనుకుంటున్నట్లు ఆ కారు అమ్మాయిలను కిడ్నాప్ చేసే ముఠాది కాదని తెలిపారు.

'ఏ'వన్ బౌలింగ్

- తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులకే కుప్పకూలిన ఇండియా–డీ
- మరో మ్యాచ్‌లో భారీ స్కోరు సాధించిన ఇండియా–సీ జట్టు
- దీటుగా జవాబిస్తున్న ఇండియా–బీ



అర్ధసెంచరీలు సాధించిన అభిమన్యు ఈశ్వరన్, జగదీశన్



బ్యాటర్‌ను రన్‌అవుట్ చేస్తున్న కీపర్



మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు



మ్యాచ్‌లో సందడి చేస్తున్న విద్యార్థులు



జాతీయ పతాకంతో విద్యార్థుల సందడి

అనంతపురం: అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన మైదానంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఇండియా–ఏ జట్టు బౌలర్ల ధాటికి ఇండియా–డీ జట్టు బ్యాటర్లు విలవిల్లాడారు. తొలి ఇన్నింగ్స్‌లో 52.1 ఓవర్ల వద్ద 183 పరుగులకు ఆలౌట్ అయ్యారు. జట్టులో దేవదత్ పడిక్కల్ 15 ఫోర్లతో 92 పరుగులు, హర్షిత్ రాణా 31, రికీ భుయి 23 పరుగులు చేశారు. మిగిలిన బ్యాటర్లు ఎవరూ రాణించలేదు. ఇండియా–ఏ జట్టు బౌలర్లు ఖలీల్ అహమ్మద్, అకీబ్ ఖాన్ చెరో మూడు వికెట్లు సాధించి ఇండియా–డీ జట్టును కోలుకోలేని దెబ్బ తీశారు. మిగిలిన బౌలర్లు ప్రసిద్ధ కృష్ణ, తనుష్, సామ్స్ చెరో వికెట్ తీశారు.

ఇండియా–ఏ కు 107 పరుగుల ఆధిక్యత

8 వికెట్ల నష్టానికి 288 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు శుక్రవారం ఆట కొనసాగించిన ఇండియా–ఏ జట్టు రెండు పరుగులు సాధించిన తర్వాత 290 పరుగులకు ఆలౌట్ అయింది. 89 పరుగులతో సెంచరీ దిశగా అడుగులు వేస్తున్న సామ్స్ ములానీ ఊహించని విధంగా హర్షిత్‌రాణా బౌలింగ్‌లో టైడ్ చేతికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 15 పరుగులతో ఖలీల్ అహమ్మద్ నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం తన తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా–డీ జట్టు పేలవమైన ఆటతీరుతో 52.1 ఓవర్ల వద్ద 183 పరుగులకు చతికిలబడింది. దీంతో ఇండియా ఏ జట్టు 107 పరుగుల ఆధిక్యత సాధించింది. ఇండియా డీ జట్టులో అథర్వ టైడ్ 4 పరుగుల వద్ద అహమ్మద్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూ అయ్యాడు. 14 పరుగుల వద్ద యష్‌దూబే.. అకీబ్‌ఖాన్ బౌలింగ్‌లో కుషగ్ర చేతికి చిక్కాడు. జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పేలవమైన ఆట తీరుతో ఎలాంటి పరుగులు చేయకుండానే అహమ్మద్ బౌలింగ్‌లో అకీబ్‌ఖాన్ చేతిలోకి బంతిని కొట్టి పెవిలియన్ దారి పట్టాడు. 92 పరుగులతో సెంచరీ వైపుగా అడుగు వేస్తున్న దేవదత్ పడిక్కల్ ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో కుషగ్రకు క్యాచ్ ఇచ్చాడు. 5 పరుగుల వద్ద సంజూశామ్‌సన్.. అకీబ్ బౌలింగ్‌లో ప్రసిద్ధ్‌కృష్ణ చేతికి చిక్కాడు. రికీబుయ్ 23 పరుగులు చేసి అహమ్మద్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూ అయ్యాడు. సరాన్ జైన్ 8 పరుగులు సాధించి కోటియన్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూ కాగా, 31 పరుగులు చేసిన హర్షిత్ రాణాను ములానీ క్లీన్ బౌల్డ్ చేశాడు. అర్షదీప్ ఎలాంటి పరుగులు చేయకుండా రన్‌అవుట్ కాగా, విద్వత్ కావేరప్ప రెండు పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా–ఏ జట్టు ఆట ముగిసే సమయానికి 28.1 ఓవర్లకు వికెట్ కోల్పోయి 115 పరుగులు సాధించింది. ప్రథమ్‌సింగ్ 59 క్రీజ్‌లో ఉన్నాడు. 56 పరుగుల వద్ద మయాంక్ అగర్వాల్... శ్రేయస్ అయ్యర్ బౌలింగ్‌లో కాట్ అండ్ బౌల్డ్ అయ్యాడు.



సిల్లీ పాయింట్‌లో క్యాచ్ పడుతున్న ఫీల్డర్

అదరగొట్టిన ఇండియా–సీ

మరో మ్యాచ్‌లో ఇండియా–బీ జట్టుపై ఇండియా–సీ జట్టు భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులో ఆల్‌రౌండర్ మనవ్ సుతార్ 82 (11 ఫోర్లు, 3 సిక్సర్లు) పరుగులు చేశారు. అన్షుల్ కాంభోజ్ 38, మయాంక్ మార్ఖండే 17 పరుగులు చేశారు. ఇండియా–బీ జట్టు బౌలర్లలో ముఖేష్ కుమార్ 4, రాహుల్ చహార్ 4 వికెట్లు, నవదీప్ సైనీ, నితీష్ కుమార్ రెడ్డి చెరో వికెట్ తీశారు. అనంతరం తన తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా–బీ జట్టు ధీటుగా జవాబిచ్చింది. జట్టులో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 51(4 ఫోర్లు, 1 సిక్సర్), నారాయణ్ జగదీశన్ 67 (8 ఫోర్లు) రాణించారు. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా–బీ జట్టు వికెట్ నష్టపోకుండా 124 చేసింది. జట్టులో అభిమన్యు 51, జగదీషన్ 67 పరుగులతో అజేయంగా నిలిచారు. 36 ఓవర్లు వేసిన ఇండియా–సీ జట్టు బౌలర్లు ఆరు ఎక్స్‌ట్రాలు ఇచ్చారు.

జీఓ కాదు.. నిధులివ్వండి

- శ్రీసత్యసాయి నీటి ప్రాజెక్ట్ కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న శ్రీసత్యసాయి నీటి ప్రాజెక్టు కార్మికులు

అనంతపురం అర్బన్: శ్రీసత్యసాయి ప్రాజెక్టుకు రూ.30 కోట్లు నిధులు ఇస్తున్నట్లు జీఓ ఇవ్వడం కాదు... ముందుగా నిధులు విడుదల చేసి ప్రకటనలివ్వాలంటూ ఆ ప్రాజెక్టు కార్మికులు శుక్రవారం ఉదయం అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నీటి ప్రాజెక్టుల కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. కార్మికుల వేతనం ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగితే జీఓ వచ్చింది కానీ, నిధులు ఇంకా రాలేదని చెబుతున్నారన్నారు. ప్రాజెక్టుకు రూ.30 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం జీఓ ఇవ్వడం బాగున్నా.. నిధులు విడుదల చేయకుండా మభ్య పెట్టడం సరికాదన్నారు. తక్షణం నిధులు విడుదల చేసి కార్మికులకు బకాయిపడిన వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ కల్పిస్తామంటూ గతంలో అధికారులు చేసిన అగ్రిమెంట్‌ని అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరమయ్యే వరకూ సమ్మెను కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

యువకుడి దుర్మరణం



పవన్(ఫైల్)

బత్తలపల్లి: ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరంలోని ఐదో రోడ్డు ఎంపీ కాలనీలో నివాసముంటున్న గుగ్గిళ్ల అంజనేయులు కుమారులు పవన్(27), ఈశ్వర్ చీరల వ్యాపారంతో కుటుంబానికి చేదోడుగా ఉన్నారు. రోజూ ద్విచక్ర వాహనంపై చీరలను గ్రామాలకు తీసుకెళ్లి విక్రయించేవారు. ఈ క్రమంలో శుక్రవారం వ్యాపార నిమిత్తం చీరలు తీసుకుని ద్విచక్ర వాహనంపై కదిరికి బయలుదేరారు. మార్గం మధ్యలో బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి వద్దకు చేరుకోగానే సర్వీసు రోడ్డు నుంచి పొలాలకు వెళ్లేందుకు జాతీయ రహదారిపై శరవేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్‌ను గమనించేలోపు ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్పగాయాలతో ఈశ్వర్ బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న బత్తలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. క్షతగాత్రుడిని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, పవన్‌కు భార్య స్వాతి, కుమార్తె ఉన్నారు.

ప్రమాదంలో కార్మికుడి మృతి



మృతుడు గంగయ్య

తాడిపత్రి రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని రామేశ్వరానికి చెందిన గంగయ్య (35) తాడిపత్రి మండలం చుక్కలూరు వద్ద ఉన్న బొగ్గుల పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన... తన ద్విచక్ర వాహనాన్ని మరమ్మతుకు ఇచ్చేందుకు వెళుతుండగా యుగుడూరు క్రాస్ వద్ద వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని నిలబెట్టకుండా వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు.

చిన్నముష్టూరులో ఆరోగ్య కేంద్రంపై దాడి



శిలాఫలకాన్ని పగులగొట్టిన దృశ్యం



కిటికీ అద్దాలను ధ్వంసం చేసిన దృశ్యం

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరులో ప్రధాన రహదారి పక్కనే కొత్తగా నిర్మించిన ఆయుష్మన్ భారత్ హెల్త్ అండ్ వెల్ సెంటర్‌పై గురువారం రాత్రి దుండగులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ మహానందరెడ్డి శుక్రవారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టిన వెల్ సెంటర్‌ను నిర్మాణ పనులు సార్వత్రిక ఎన్నికలకు రెండు నెలల ముందు పూర్తయ్యాయన్నారు. ఈ లోపు ఎన్నికల కోడ్ రావడంతో భవనాన్ని అధికారులు స్వాధీనం చేసుకోలేదని వివరించారు. భవన నిర్మాణానికి సంబంధించి బకాయి నిధులను రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ మంజూరు చేయలేదని, అంతేకాక భవనాన్ని సైతం స్వాధీనం చేసుకోలేదన్నారు. ఈ క్రమంలో దుండగులు గురువారం రాత్రి నూతన భవనం తలుపులు పగులగొట్టి లోపలకు ప్రవేశించి 8 ఫ్యాన్లు, ఫర్నీచర్, స్టీల్ పైపులు అపహరించుకెళ్లారన్నారు. అంతేకాక భవన నిర్మాణానికి సంబంధించి సమగ్ర వివరాలతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సైతం పగులగొట్టారని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

కుప్పకూలిన హెచ్చెల్సీ బ్రిడ్జి

- నాగేపల్లికి స్తంభించిన రాకపోకలు



హెచ్చెల్సీలో ఒరిగిపోయిన బ్రిడ్జి

కణేకల్లు: స్థానిక హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలోని కణేకల్లు - దర్గాహొన్నూరు మధ్య నాగేపల్లి శివారులో 155 కిలోమీటర్ వద్ద ఉన్న బ్రిడ్జి శుక్రవారం మధ్యాహ్నం కుప్పకూలింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దాదాపు 56 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి స్లాబ్ వద్ద కంకర తేలిపోయి శిథిలమైంది. అయినా గత్యంతర లేక దీనిపైనే రాకపోకలు కొసాగిస్తూ వచ్చారు. ఈక్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ బోర్‌వెల్ వాహనం బ్రిడ్జి దాటిన మరు క్షణమే పెద్ద శబ్దంతో కూలిపోయింది. పైపులు, ఇతర సామగ్రితో ఉన్న మరో లారీ బ్రిడ్జికి అటువైపే నిలిచిపోయింది.

దుస్థితిలో మరికొన్ని బ్రిడ్జిలు..

కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్‌లో హెచ్చెల్సీ గట్టుపై వివిధ గ్రామాల ప్రజల రాకపోకలు సాగించేందుకు నిర్మించిన బ్రిడ్జిలు పూర్తి శిథిలావస్థకు చేరుకున్నాయి. హెచ్చెల్సీ కాలువపై ఉన్న బ్రిడ్జిల్లో ఇప్పటి వరకూ 115 కిలోమీటరు, 147 కిమీ, 155 కిమీ, 165 కిమీ, 169 కిమీ, 189 కిమీ వద్ద బ్రిడ్జిలు కూలిపోయాయి. ఏడాది క్రితం గత నవంబర్‌లో కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ బ్రిడ్జి కూలిపోగా... ఏడాది పూర్తికాక ముందే 155 కిమీ (నాగేపల్లి) వద్ద బ్రిడ్జి కూలిపోయింది. ప్రధాన రహదారులైన బళ్లారి, ఉరవకొండ, కణేకల్లు మార్గంలోనూ బ్రిడ్జిలున్నాయి. 58 ఏళ్ల క్రితం వీటిని నిర్మించారు. ప్రస్తుతం ఇవి కూలిపోయే దశలో ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలో పెద్ద, చిన్న అక్విడెక్ట్‌లు, యూటీ (అండర్ టన్నెల్)లు, బ్రిడ్జిలు, సూపర్ ప్యాసెజ్‌లు కలిపి మొత్తం 44 ఉన్నాయి. కణేకల్లు వద్ద ఉన్న పెద్ద అక్విడెక్ట్, ఉద్దేహాళ్ వద్దనున్న చిన్న అక్విడెక్ట్‌లు కొంత వరకు బాగానే ఉన్న పలు బ్రిడ్జిలు ప్రమాదకర స్థితికి చేరుకున్నాయి.

త్వరలో మాల్యాం బ్రిడ్జికి ముప్పు..

కణేకల్లు–ఉరవకొండ మార్గంమధ్యలో మాల్యాం గ్రామం వద్ద హెచ్చెల్సీపై ఉన్న బ్రిడ్జి పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్ అడుగుభాగంలో రాళ్లు ఐదేళ్ల క్రితమే ఊడిపోయాయి గోడలు బలహీనంగా మారాయి. ఈ మార్గంలో అధిక సంఖ్యలో లారీలు, బస్సులు ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. ఈ బ్రిడ్జి కూడా త్వరలో కూలిపోవడం తథ్యమని ప్రజలు అంటున్నారు. ఇప్పటికే వేదవతి హగిరిపై ప్రమాదకరంగా ఉన్న పెద్ద అక్విడెక్ట్‌పై వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. దీంతో కణేకల్లు–ఉరవకొండ మార్గంలో నడుస్తున్న బస్సులు కణేకల్లు వరకు రావడం లేదు. బస్సులన్నీ మాల్యాం వరకే వచ్చి వెళుతున్నాయి. ఈ బ్రిడ్జి కూలిపోతే ఉరవకొండ, గుంతకల్లు, అనంతపురానికి రాకపోకలు స్తంభించిపోతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్ధంతరంగా ఆగిన బ్రిడ్జి నిర్మాణాలను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: వినాయక నిమజ్జనం సందర్భంగా తప్ప తాగి ఓ యువకుడిని కత్తి పొడిచి హతమార్చిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం అనంతపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ రాజేంద్రనాథయాదవ్ వెల్లడించారు. అనంతపురంలోని నవోదయ కాలనీలో నివాసముంటున్న అక్క, బావ పిలుపు మేరకు రాజా నగర్‌కు చెందిన శ్రీధర్ (27) గత బుధవారం వారి ఇంటికి వెళ్లాడు. గణేశ నిమజ్జనం సందర్భంగా అక్కడ తేజ, మరికొందరు చేస్తూ శ్రీధర్‌ను పిలుచుకెళ్లి శ్మశాన వాటిక వద్ద మద్యం సేవించారు. ఈ క్రమంలో పొరపాటున బీరు బాటిల్ కిందపడి పగిలిపోయింది. దీంతో తేజా, శ్రీధర్ మధ్య మాటామాట పెరిగింది. స్నేహితులు సర్ది చెప్పినా తేజ వినలేదు. దీంతో శ్రీధర్ బంధువులు కల్పించుకుని బీరుబాటిలు తెప్పిస్తామని నచ్చచెప్పబోయారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తేజ దుర్భాషలాడడంతో శ్రీధర్ తిరగబడ్డాడు. దీంతో తేజ రెచ్చిపోయి అప్పటికే తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న కత్తి తీసి శ్రీధర్ ఎడమ భుజంపై పలుమార్లు పొడవడంతో తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలాడు. విషయాన్ని గమనించిన ఆయన బావ జగదీష్ క్షతగాత్రుడిని వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్సకు స్పందించిక శ్రీధర్ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం నిందితుడు తేజను అరెస్ట్ చేసి, పిడిబాకును స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



మృతి చెందిన చంద్రానాయక్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విధి నిర్వహణలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు అనంతపురం జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చంద్రనాయక్ (40). సీఎం సెక్యూరిటీ వింగ్‌లో టర్మ్ విధులు నిర్వర్తించేందుకు వచ్చాడు. వరద నష్టంపై అధికారులతో కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబు సమావేశం కానున్న నేపథ్యంలో విధులు నిర్వర్తించేందుకు అక్కడకు చేరుకున్న చంద్రానాయక్‌కు గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. చుట్టు పక్కల ఉన్న వారు గమనించి సీపీఆర్ చేశారు. గురక ఎక్కువ కావడంతో సూర్యారావుపేట స్టేషన్ సీఐ తన వాహనంలో సమీపంలోని ఆంధ్ర బ్రెయిన్ అండ్ హార్ట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే కానిస్టేబుల్ చంద్రానాయక్ మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కాగా, విషయం తెలుసుకున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు శుక్రవారం హాస్పటల్‌కు వెళ్లి చంద్రానాయక్ మృతదేహాన్ని సందర్శించారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి సవిత అన్నారు.

15న పశుశాఖ అసిస్టెంట్లకు శాఖాపరమైన పరీక్ష

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలో ఇటీవల నియమితులైన 449 మంది విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్ఏ)కు ఈ నెల 15న శాఖాపరమైన పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ అనంతపురం జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఆదివారం జరిగే పరీక్షకు సంబంధించి ఇప్పటికే అందరికీ హాల్‌టికెట్లు పంపిణీ పూర్తయిందన్నారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో అంబర్ ప్రాజెక్టులో భాగంగా నిరుద్యోగ యువతకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు కేంద్రం మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్, హోటల్ మేనేజ్‌మెంట్ (ఎఫ్అండ్‌బీ), జాబ్ రోల్స్‌తో పాటు కంప్యూటర్ కింద ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు స్థానిక కౌశల్ కేంద్రం లేదా 9398154460, 7569659964 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



జేసీ శివనారాయణ శర్మకు డీడీని అందజేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: వరద బాధితుల సహాయార్థం కళ్యాణదుర్గంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఏడు రోజుల పాటు పట్టణంలో విరాళాలు సేకరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మను ఆయన చాంబర్‌లో కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓలు కె.శ్రీధర్, కె.రవిశంకర్, వలంటీర్లు కలిశారు. విరాళం మొత్తం రూ.65,123 సీఎం సహాయ నిధికి డీడీ రూపంలో అందించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు సాయిరాం, మల్లి, కార్తీక్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

రాప్తాడు: నులి పురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున అన్నారు. ఈనెల 17న నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకటి నుంచి 19 ఏళ్ల బాల, బాలికల్లో నులి పురుగుల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. దీంతో రక్తహీనత పిల్లల్లో ఎదుగుదల లోపించడంతో పాటు కడుపునొప్పి వస్తుందన్నారు. బాల, బాలికలు ఆల్బెండజోల్ మాత్రలను చంపరించి మింగటం వల్ల నులిపురుగులు చనిపోతాయన్నారు. రక్తహీనత నుంచి కోలుకుంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు వేస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, ఏఓ రత్నబాయి పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి

అనంతపురం: సమతుల ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండవచ్చని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నా రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవీరా హాస్పిటల్ సహకారంతో జేఎన్‌టీయూలో ఉచిత గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ శరీరం ఒక అద్భుతమైన సృష్టి అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం తప్పనిసరిగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కిమ్స్ సవీరా హాస్పిటల్ డాక్టర్ ఎన్.మహమ్మద్ షాహిద్ (గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు) మాట్లాడుతూ.. మానవాళిలో 20 శాతం నుంచి 60 శాతం మంది గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ వి.వరప్రసాద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.మమత, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డాక్టర్ నీరజ, డాక్టర్ జోజిరెడ్డి పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

అనంతపురం అర్బన్: విజయవాడ వరద బాధితులకు తమవంతు సహాయంగా తిలక్ రోడ్డులోని కేఎస్ గార్మెంట్ యజమానులు రూ.50 వేలు విలువ చేసే ఆడపిల్లలు దుస్తులను వితరణ చేశారు. చేతి వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల సేకరణలో గార్మెంట్ రాజకుల్లాయప్ప, హుసేన్‌బీ కుమారుడు మహి కుటుంబ సభ్యులు దుస్తులను అందజేశారు. వారికి చేతి వృత్తిదారుల సమాఖ్య నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య, నాయకులు పోతులయ్య, సి.వి.హరికృష్ణ, నాగప్ప, నాగరాజు, భూషణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

హిందీ భాషా సేవకులు

- జాతీయ భాషను ప్రచారం చేస్తున్న అనంత కవులు
- ప్రముఖ గ్రంథాలు హిందీలోకి అనువాదం
- భాషా ప్రచారంలో చెరగని ముద్ర

సందర్భం: నేడు హిందీ దివస్



అనంతపురం ఎడుకేషన్/కల్చరల్: సమగ్రతను సాధించడం, అందరూ సమైక్యంగా ఉండటం కోసం దేశాన్నంతటినీ ఒకటి చేయగల భాష హిందీ. జిల్లాకు చెందిన హిందీ పండితులు రాజభాషా ప్రచారానికి తమ జీవితాలను అంకితం చేస్తున్నారు. తెలుగులో ఉన్న ప్రముఖ గ్రంథాలను హిందీలోకి అనువాదం చేసి చెరగని ముద్ర వేసుకుంటున్నారు. హిందీ భాషా ప్రచారంలో తమకుంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటున్నారు. 1950 సెప్టెంబర్ 14వ తేదీన హిందీని జాతీయ భాషగా రాజ్యాంగం గుర్తించింది. నాటి నుంచి ఏటా హిందీ దివస్‌ను జరుకుంటున్నాం. ఈ నేపథ్యంలోనే అనంత వాసులూ స్ఫూర్తిదాయకమైన రాజభాషా ప్రచారం, అభ్యాసంలో ముందున్నారు. శనివారం హిందీ దివస్ వేడుకలు పలు చోట్ల జరగనున్నాయి.

రచనలతో భాషా ప్రచారం

జాతీయ భాషను ప్రచారం చేస్తున్న కవుల్లో హిందీ పండితుడిగా పని చేస్తున్న డాక్టర్ జూటూరు షరీఫ్ ముందు వరుసలో ఉంటారు. నార్పల మండలానికి చెందిన ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ వారు హిందీలోని 'బిల్లోంకి భారత్'ను 'బిల్లుల జానపద మహాభారతం' పేరుతో తెలుగులోకి అనువదించారు. దేశవ్యాప్తంగా పలువురు ప్రసిద్ధ కథకులు రచించిన 'భారతీయ కహానియా' పుస్తకంలోని కథలను షరీఫ్ 'భారతీయ బాలల కథలు' పేరుతో అనువదించారు. అలాగే ఆచార్య రాచపాలెం చంద్రశేఖర రెడ్డి 'పాలి' గ్రంథాన్ని 'బలి' పేరుతోనూ, సీనియర్ కవి డాక్టర్ ఆశావాది రచించిన 'అంతరంగ తరంగాలు'ను 'అంతరంగ్ తరంగ్' పేరుతోనూ, మల్లెల నరసింహమూర్తి 'జలస్వప్నం' గ్రంథాన్ని 'జల్ స్వప్న్' గాను, కెరె జగదీష్ గ్రంథం 'రాత్రి సూర్యుడు' పుస్తకాన్ని 'నిశీద్ కా సూర్య్' పేరుతో హిందీలోకి అనువాదం చేశారు. మహాత్మ గాంధీ అనుచరుడు బతక్ మియా అన్సారి స్వాతంత్ర్యోద్యమ చరిత్రను నజీర్ అహ్మద్ రచిస్తే దానిని కూడా జూటూరు షరీఫ్ హిందీలోకి 'గాంధీ కే ప్రాణ్ రక్షక్ బతక్‌మియా' పేరుతో అనువదించి భాషా ప్రచారానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

హిందీ సేవాసదన్ వినూత్న ఒరవడి

హిందీ భాషా ప్రేమికుడు, ఉపాధ్యాయుడైన గైబువల్లి ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో అనంత వేదికగా ఏర్పడిన హిందీ సేవా సదన్ ప్రారంభించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. హిందీ దివస్ వచ్చిందంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోని హిందీ పండితులు, రచయితలను ఇప్పటి వరకు వందల సంఖ్యలో సత్కరించారు. పండిత శిక్షణ, ట్రాన్స్‌లేటర్ల కోర్సులతో ఎంతో మందికి ఉపాధి మార్గంగా మారింది. విద్యార్థుల్లో హిందీపై మక్కువ పెంచడానికి తీసుకుంటున్న కృషితో వేలాది మంది జాతీయ భాష వైపు అడుగులేసేలా చేస్తోంది. ఆంధ్ర, తెలంగాణ హిందీ ప్రభార సభకు అనంతకే చెందిన ఓబయ్య అధ్యక్షుడిగా, గైబువల్లి ప్రధాన కార్యదర్శిగా ఉండటం విశేషం.

అగ్రస్థానంలో 'అనంత'



గత 40 ఏళ్లుగా ఆర్ట్స్ కాలేజ్‌లో హిందీ సాహిత్యం రెండవ భాషగా బోధించే అవకాశం ఉండడం వల్ల జిల్లాలో ఎంతో మంది హిందీ పండితులయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అనంత వాసులే అధికంగా హిందీని అభ్యసిస్తున్నారు. కానీ పాఠశాలల విషయానికొస్తే చాలా చోట్ల హిందీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఇంటర్‌లో సెకండ్ లాంగ్వేజీగా హిందీని తీసుకునే వారు కరువవుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.

– గైబువల్లి, హిందీ సేవా సదన్ వ్యవస్థాపక కార్యదర్శి

హిందీపై చిన్నచూపు వద్దు



భారతీయ మైత్రికి ప్రతిబింబమైన హిందీని ఒకటో తరగతి నుంచే అభ్యసించేలా చర్యలు ఉండాలి. తీరా 6వ తరగతిలో వర్ణమాల నేర్చుకునే వాళ్లకు హై స్టాండర్స్‌లో ఉన్న హిందీ పాఠాలు అర్థం కావడం కష్టంగా మారింది. దేశంలో అతి ఎక్కువ మంది మాట్లాడే భాష హిందీ. వారి సాహిత్యాన్ని సంస్కృతి, ఆచార వ్యవహారాలను తెలుసుకునేందుకు హిందీ భాషే చక్కటి వారధి. దురదృష్టమేమంటే పరీక్ష విధానంలో హిందీ విషయానికొస్తే అత్తెసురు మార్కులు వస్తే చాలు అన్నట్లు నిబంధనలు ఉన్నాయి. ఇటువంటి సమయంలో భాష అభివృద్ధి చెందాలంటే సాధ్యం కాదు. త్రిభాషా సూత్రం ప్రకారం హిందీపై చిన్నచూపు లేకుండా సమానంగా గౌరవించాలి.

– ఫయాజ్, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, మాల్యం

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా



పృథ్వీతారక్ రెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సంగమేష్ నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థి పి.పృథ్వీ తారక్‌రెడ్డి జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటాడు. ఇటీవల తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఆగ్రాలో నిర్వహించిన సబ్ జూనియర్ అండర్-35 కేజీల బాలుర విభాగంలో పృథ్వీతారక్ కాంస్య పతకం దక్కించుకున్నాడు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని కరస్పాండెంట్ సి.సూర్యనారాయణ రెడ్డి, పాఠశాల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపల్ కె.పద్మావతి, అభినందించారు.

కొనసాగుతున్న నిరసన



నిరసన తెలుపుతున్న స్టాఫ్‌నర్సులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు నిరసన కొనసాగించారు. కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలంటూ శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో మానవహారంగా ఏర్పడి.. వీవాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు అసోసియేషన్ అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు వెంకటేష్ నాయక్, సురేష్, సుదర్శన్, శోభ, నారాయణమ్మ, మానస, శ్రీవిద్య, శ్రీలక్ష్మి, నాజియా, మాధవి, త్రివేణి, స్వప్న, కళ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

అనంతపురం కార్పొరేషన్: రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ఓడినప్పుడు కృంగిపోకుండా రెట్టింపు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతను ఆయన నివాసంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్దామన్నారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీసాల రంగన్న, దేవదాయ ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, రూరల్ ఎంపీపీ వరలక్ష్మి, నాయకులు అనిల్‌కుమార్ గౌడ్, హనుమంతు, ఈరన్న, కాలేష, ఇర్షాద్, శివాజీ, వెంకట్రాముడు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అండగా ఉంటుంది..

అనంతపురం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందకండి. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట ఎంపీటీసీ-4 మహబూబీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి, రుద్రంపేట పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత వెంకటరామిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారాన్ని చేపట్టిన కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. టీడీపీ అరాచకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు, నాగమణి, ఖాజా, జయమ్మ, షరీఫ్, అక్కమ్మ పాల్గొన్నారు.

రేపు ఓనం వేడుకలు

అనంతపురం కల్చరల్: పాతూరు చెరువు కట్టపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి మణికంఠ గౌతమ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ సాయి అయ్యప్ప సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు గణపతి పూజ, హోమం, అష్టాభిషేకం, స్వామికి అన్నప్రసాద ప్రసన్నం, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం దర్శనం, మహా దీపారాధన ఉంటాయని పేర్కొన్నారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం



వెంకట సుబ్బమ్మకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: తాడిపత్రిలో హోంగార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డి.వెంకటసుబ్బమ్మకు 4,39,200 ఆర్థిక సాయాన్ని ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం అందజేశారు. జిల్లా హోంగార్డులు తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందజేయడాన్ని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ డీవీ రమణ మూర్తి, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

రేపు అపుస్మా సర్వసభ్య సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా సర్వసభ్య సమావేశం ఈ నెల 15న రాప్తాడు మండలం మరూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న మాంటిస్సోరి ఎలైట్ స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు శేఖర్ రావు, పరంజ్యోతి, అపుస్మా రాష్ట్ర ప్రధానకార్యదర్శి తులసీ ప్రసాద్ హాజరు కానున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని డివిజన్ల నుంచి కరెస్పాండెంట్లు తప్పకుండా హాజరుకావాలని కోరారు. కాగా సర్వసభ్య సమావేశం ఏర్పాట్లపై చర్చించేందుకు శుక్రవారం సాయంత్రం నగరంలోని కార్యాలయంలో సమావేశమయ్యారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర, గౌరవ అధ్యక్షులు నాయుడు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, స్టేట్ కన్వీనర్ నాగరాజు, శశిభూషణ్, సూర్యనారాయణ రెడ్డి, రవిశంకర్ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛతా హీ సేవ



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగులో అనంతపురం నగరపాలక సంస్థ అగ్రస్థానంలో నిలవాలి. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అనంతపురం నగరపాలక సంస్థకు మంచి ర్యాంకు తీసుకొచ్చేందుకు సిబ్బంది అంకితభావంతో పని చేయాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి అక్టోబర్ వరకూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో పాటు ప్రజలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. రోడ్డుపై చెత్త కనిపించ కూడదన్నారు. సకాలంలో కంపోస్టు యార్డుకు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చాలన్నారు. తద్వారా జాతీయ స్థాయిలో నగరపాలక సంస్థకు మంచి ర్యాంకు దక్కుతుందన్నారు. ముఖ్యంగా సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతగా పని చేయాలన్నారు. సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

ఆత్మకూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు వివరించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. మండలంలోని సిద్దరాంపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. కిశోర బాలికలకు పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. బాల్య వివాహాలు చేసినా ప్రోత్సహించినా చట్టరీత్యా నేరస్తులని తెలిపారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తినే పౌష్టికాహారంపై వివరించారు. ముఖ్యంగా బాలింతలు పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలని పేర్కొన్నారు. తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని తెలియజేశారు. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలో విద్యను బోధించాలని ఆదేశించారు. అనంతరం గర్భవతులకు సీమంతం చేశారు. ఏసీడీపీఓ వనజాక్షి పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి

రాప్తాడురూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ సూచించారు. అనంతపురం రూరల్-5 సెక్టార్ పరిధిలోని విద్యారణ్య నగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. చిన్నారుల బరువు, ఎత్తును కొలతలు వేయించారు. సూపర్‌వైజర్ జయశ్రీ మాట్లాడుతూ.. ఆకుకూరలు, కూరగాయలు విరివిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పాలు, కోడిగుడ్లు, బాలామృతం తదితర పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు గౌతమి, చంద్రకళ, మాధవి, ఈశ్వరి, ఆశావర్కర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కనగానపల్లి: మంచి పోషకాలు విలువలు కలిగిన ఆకుకూరలు, పండ్లు, గుడ్లు తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో సమావేశం ఏర్పాటు చేశారు. పోషకాహారాలు, ఆరోగ్య సూత్రాలపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరం 'వాటర్ షెడ్ పథకం'



మాట్లాడుతున్న డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి

రాప్తాడు: వాటర్‌షెడ్ పథకం రైతులకు వరంలా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడంతో జిల్లాలో ఈ పనులు జోరుగా సాగుతున్నాయని డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హంపాపురం గ్రామంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో వాటర్ షెడ్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. వర్షాల ద్వారా ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకింపజేసి, వ్యవసాయానికి అనుకులంగా మార్చుకోవాలన్నారు. వాటర్‌షెడ్ పథకం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం జరుగుతుందన్నారు. రైతుల పొలాలను అభివృద్ధి చేస్తూ, రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లను అందజేసి పంట దిగుబడిని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. రాప్తాడు మండలంలో రూ.2.80 లక్షలు ఈ పథకం కింద మంజూరు చేయడం జరిగిందన్నారు. హంపాపురం గ్రామానికి రూ. కోటి, గొందిరెడ్డిపల్లికి రూ.1.20 లక్షలు, రామినేపల్లికి రూ.60 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. వాటర్ షెడ్ పథకం కింద రైతులు తమ భూముల్లో ఫారం పాండ్స్ గుంతలు తవ్వుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్ పాల్గొన్నారు.

16న మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవం

అనంతపురం కల్చరల్: ది వరల్డ్ టీచర్ ట్రస్టు అనంతపురం శాఖ వారి ఆధ్వర్యంలో ఈనెల 16న మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవం జరగనుంది. స్థానిక టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం సీవీవీ మాస్టర్ ప్రార్థన, అనంతరం యోగా విశిష్టతపై ప్రవచనం, ప్రణవారాధన, లలితా సహస్రనామ పారాయణ స్తుతి, గురుపాదుకా స్తోత్రం ఉంటాయి. రాత్రి మాస్టర్ ఈకే నీరాజనంతో కార్యక్రమం ముగుస్తుందని నిర్వాహకుడు ప్రకాష్‌రావు తెలిపారు.

ఏచూరి స్ఫూర్తితో పోరాటాలు



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: తుది శ్వాస వరకు ప్రజల కోసం ఉద్యమించిన సీతారాం ఏచూరి ఆశయ స్ఫూర్తితో కార్యకర్తలు పోరాటాలు సాగించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపంలోని ఫెర్రర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమాలే ఊపిరిగా తన చివరి శ్వాస వరకు పోరాటాలు సాగించిన సీతారాం ఏచూరి ఓ ఉద్యమ శిఖరం అని కొనియాడారు.

సీతారాం ఏచూరికి నివాళి

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. సీపీఎం నగర కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం నగర పరిధిలోని పలు కాలనీల్లో సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకట నారాయణ, ప్రకాష్, వలి, రాజు, వెంకటేష్, గఫూర్, రసూల్, ఆర్టీసీ యూనియన్ నాయకులు భాస్కర్, బీసీ సంఘర్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి వడ్డే లక్ష్మీనారాయణ. పాల్గొన్నారు.

రాప్తాడు: పేదల, పీడుతుల ఉద్యమాలకు మాజీ రాజ్యసభ సభ్యుడు, కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వేగుచుక్క అని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాప్తాడులో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారాం పేదల పక్షాన ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు సాగించారన్నారు. ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, నాయకులు బ్రహ్మ, సుబ్బారావు, మధు, లక్ష్మన్న, ప్రతాప్, భాస్కర్, శివ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నిర్వీర్యం అయిపోయింది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నేతృత్వంలో నూతన కమిటీలు వేశారన్నారు. అందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇచ్చారన్నారు. తన ఎంపికకు సహకరించిన సీనియర్ నాయకులు రఘువీరారెడ్డి, సాకే శైలజానాథ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేసే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట సత్యం, కాపు వాసు, శర్మాస్ వలి, ఇమాం పాల్గొన్నారు.

'ఏ చిన్న స్టిక్కర్లు ఉన్నా వెంటనే తొలగించండి'

- వాట్సప్ గ్రూపుల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆడియో సందేశం

ఆత్మకూరు: 'గత ప్రభుత్వానికి సంబంధించి సచివాలయాలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న స్టిక్కర్లు, ప్రచార బోర్డులను వెంటనే తొలగించాలి. ఎట్టి పరిస్థితుల్లో వాటిని ఉంచకూడదు. వెంటనే తీసేయండి అంటూ' ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ శుక్రవారం వాట్సప్ గ్రూపుల్లో చెప్పిన మాటలు ఇవి. వివరాల్లోకి వెళ్తే.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోలు పలు కార్యాలయాల బయట ఉన్నాయి. పలు పత్రికల్లో పాత బోర్డులతో ఇంకా ప్రచారాలు అంటూ రాయడంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ అత్యుత్సాహం చూపారు. గత ప్రభుత్వానికి సంబంధించిన స్టిక్కర్లు, బోర్డులను వెంటనే తీసేయండి అంటూ ఓ ఆడియో ద్వారా పంచాయతీ సెక్రటరీలకు తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని పలుసార్లు పత్రికల్లో వచ్చినా కనీసం కన్నెత్తి చూడని అధికారులు.. ఇప్పుడు మాత్రం బోర్డులు, స్టిక్కర్లు తొలగించాలని అత్యుత్సాహం చూపడంపై సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉండాలి. ఇలా ఏకపక్షంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రజా ప్రతినిధులు మండిపడుతున్నారు.

